## క్లుప్తంగా

### నేడు రాస్నం గ్రామానికి ఎమ్మెల్యే రాక

యాలాల: మండలంలోని రాస్నం గ్రామానికి శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రానున్నారని క్యాంపు కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి అసైన్డ్ భూముల్లో సాగు చేసే రైతులకు మంజూరైన బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే రానున్నట్లు తెలిపారు. గ్రామంలోని రైతు వేదిక సమీపంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని వారు పేర్కొన్నారు.

### వడిచర్ల పాఠశాలను పరిశీలించిన ఎంపీఓ

బొంరాస్‌పేట: మండల పరిధిలోని వడిచర్ల ఎంపీయూపీఎస్‌ను శుక్రవారం మండల పంచాయతీ రాజ్ అధికారి రవి సందర్శించారు. పాఠశాల భవనం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలపై ఆయన ఆరా తీశారు. తరగతి గదుల తలుపులు, కిటికీలు మరమ్మతు చేయాల్సి ఉందని, అదనపు ఉపాధ్యాయులు అవసరమని హెచ్‌ఎం నరేందర్‌గౌడ్ ఎంపీఓ దృష్టికి తెచ్చారు. అంతకుముందు ఎంఈఓ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

### స్కూల్ బస్సు తనిఖీ



కండీషన్ తెలుసుకుంటున్న ఎస్ఐ విమల

బంట్వారం: పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బంట్వారం ఎస్ఐ విమల శుక్రవారం ప్రైవేట్ స్కూల్ బస్సు కండీషన్‌ను తనిఖీ చేసి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. విద్యార్థులను భద్రంగా తీసుకెళ్లాలన్నారు. వాహనం నడిపించే సమయంలో డ్రైవర్ అప్రమత్తంగా ఉండాలని, తాగి నడపొద్దని హెచ్చరించారు. బస్సు కండీషన్‌ను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలని పేర్కొన్నారు.

### ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



ఈర్లపల్లిలో ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

దుద్యాల్: మండల పరిధిలోని ఈర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఇళ్లు మంజూరు చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేదలకు ఒక్క ఇళ్లు కూడా మంజూరు చేయలేదని వాపోయారు. భూమి పూజతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మొగులయ్య, గ్రామస్థులు రాహుల్ నాయక్, రవి నాయక్, పెంటప్ప, కోటే నాయక్, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఇళ్ల పట్టాల అందజేత



కొత్తూరులో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేస్తున్న పార్టీ నాయకులు

బొంరాస్‌పేట: సీఎం రేవంత్‌రెడ్డి పాలనలోనూ ఊరూరా ఇందిరమ్మ రాజ్యం..ఇంటింటా సౌభాగ్యం అంటూ పేద కుటుంబాలందరికీ మహిళల పేరున ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మిస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తూరులో కొత్తగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. అనంతరం నిర్మాణ పనులు ప్రారంభించారు. విడతల వారిగా మంజూరయ్యే ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయకృష్ణ, రాంచంద్రారెడ్డి, మల్లికార్జున్, భీంరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### జీవాలకు టీకా వేయించండి

షాబాద్: మూగ జీవాల ఆరోగ్యంపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడలో మూగ జీవాలకు చిటుకు వ్యాధి నివారణ టీకా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవాలకు వ్యాధి నివారణ టీకా తప్పక వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, బాల్‌రాజ్, తదితరులున్నారు.

# భయం.. భయం!

విద్యా సంవత్సరం ప్రారంభమైంది. పలు ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలు విద్యార్థులకు స్వాగతం చెప్పాయి. అక్కడక్కడ శిథిలావస్థకు చేరిన భవనాలు, తరగతి గదులు ఎప్పుడు ఏ క్షణాన కూలుతాయోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయా పాఠశాలలకు ప్రహరీలు లేక విషసర్పాలు ప్రవేశిస్తున్నాయి. గేట్లు ఊడి కొన్ని, సరిపడా మూత్రశాలలు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు పట్టించుకోని మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- శిథిలావస్థలో పలు పాఠశాలలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- ఎప్పుడు కూలుతాయోనని ఆందోళన
- పట్టించుకోని అధికారులు



కొడంగల్ రూరల్: శిథిలావస్థకు చేరిన గుండ్లకుంట పాఠశాల భవనంలోని గది

### శిథిలావస్థలో గుండ్లకుంట భవనం

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట ప్రాథమిక పాఠశాలలో మూడు తరగతి గదులుండగా రెండు గదులు శిథిలావస్థకు చేరాయి. ఒక్క గదిలో మాత్రమే 20మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన గదులను డిస్‌మెటల్ చేయాల్సి ఉందని, అదనపు తరగతి గదుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఉన్నతాధికారులు వివరిస్తున్నారు.



తాండూరు రూరల్: శిథిలావస్థలో జినుగుర్తి హైస్కూల్ భవనం

### మూతబడ్డ సంకిరెడ్డిపల్లి పాఠశాల

తాండూరు రూరల్: మండల పరిధిలోని జినుగుర్తి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. 1956 సంవత్సరంలో నిర్మించిన భవనం కావడంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 136 మంది విద్యార్థులు విద్యాభ్యసిస్తున్నారు. 12 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాల ఆవరణలోని ప్రైమరీ పాఠశాల భవనంలో రెండు తరగతి గదులు, హైస్కూల్ భవనంలో మూడు నిర్వహిస్తున్నారు. జినుగుర్తి గ్రామ శివారులోని గిరిజన గురుకుల బాలికల వసతి గృహం వద్ద 6వ తరగతికి గదులు నిర్మించారు. అదనపు తరగతి గదులు దూరమవుతాయని అక్కడికి ఎవరు కూడా వెళ్లడం లేదని హెచ్‌ఎం మృత్యుంజయస్వామి తెలిపారు. సంకిరెడ్డిపల్లి తండాలోని ప్రభుత్వ పాఠశాల మూతబడింది. తండాలో 500 మంది జనాభా, 410 మంది ఓటర్లు ఉన్నారు. కానీ 10 సంవత్సరాల క్రితం పాఠశాలను అధికారులు మూసేశారు. తండా నుంచి సంకిరెడ్డిపల్లి గ్రామంలోని పాఠశాలకు 10 నుంచి 15 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



ధారూరు: ఊడిపోయిన ఒక గేటు

### కూలేందుకు సిద్ధం

ధారూరు: కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలను చూసి విద్యార్థులు భీతిల్లుతున్నారు. ధారూరు మండలంలోని నాగసమందర్ మూడు, కుక్కిందలో ఐదు, మున్నూరుసోమారంలో రెండు, ధారూరు బాలికల ఉన్నత పాఠశాలలో రెండు, ధారూరు పీఎస్‌లో ఒకటి, ధారూరు బాలుర ఉన్నత పాఠశాలలో ఒక గది డిస్‌మెటల్‌కు సిద్ధంగా ఉన్నాయి. ధారూరులోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలోకి, బాలికల ఉన్నత పాఠశాలలోకి తరుచూ విషసర్పాలు వస్తుండడంతో విద్యార్థినులు భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిళ్లు పాములు జొరబడడంతో నిద్రకు దూరమవుతున్నామని వాపోతున్నారు.

### పునాదులకే పరిమితం

కొడంగల్: పట్టణంలోని గాంధీనగర్‌లో నిర్మిస్తున్న పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పునాదులకే పరిమితం అయ్యాయి. భవన నిర్మాణ పనులు ప్రారంభించి 8 నెలలు గడిచినా ఇంకా పూర్తికాలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పాఠశాలలో 74మంది చదువుతున్నారు. ఒక గదిలో 1, 2, 3వ తరగతులు, వరండాలో 4, 5 నిర్వహిస్తున్నారు. వంట గది లేకపోవడంతో మధ్యాహ్న భోజనం వండేందుకు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు, 74మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు తరగతి గదుల కొరత ఉందని చెబుతున్నారు.



కొడంగల్: పునాదులకే పరిమితమైన అదనపు తరగతుల నిర్మాణం

### హకీంపేట్ పాఠశాలలో మూత్రశాలలు కరువు



గదులను చూపుతున్న ఉపాధ్యాయిని ఉమ

దుద్యాల్: మండలంలోని హంసంపల్లి పాఠశాలలో 14 మంది విద్యార్థులు చదువుతుండగా ఒకే ఉపాధ్యాయిని బోధిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత ఒకవైపు, మూత్రశాలలు సరిపడినన్ని లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు శిథిలభవనాలతో భయం..భయంగా చదువులు కొనసాగిస్తున్నారు. పలు మార్లు తరగతి గదిలోకి పాములు కూడా వచ్చాయని తెలిపారు. నూతన భవనం మంజూరైనప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. సాగారం తండా పాఠశాలలో 1 నుంచి 5తరగతులకు 65 మంది విద్యార్థులు ఉండగా 5 తరగతులూ ఒక్కడినే బోధించాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని ఉపాధ్యాయుడు వెంకటేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు.

### విద్యుత్ సౌకర్యం కల్పించలేక..



కుల్కచర్ల: నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారిన మరుగుదొడ్లు

కుల్కచర్ల: ఘణపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోప్యానాయక్ తండాలోని ప్రాథమిక పాఠశాలలో 8మంది విద్యార్థులు ఉన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినా పూర్తి స్థాయిలో పనులు చేపట్టలేదు. పాఠశాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో బోరు నడవడంలేదు. దీంతో మరుగుదొడ్లలో నీటి కరువు ఏర్పడి అవి నిరుపయోగంగా తయారయ్యాయి. తాగే నీటిని కూడా ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### భవనం పైకప్పు..



యాలాల: సంగెంకుర్దులో శిథిలావస్థకు చేరిన పాఠశాల పైకప్పు

యాలాల: మండల పరిధిలో 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలలున్నాయి. రేళ్లగడ్డ తండా, తొప్పెర్లగడ్డ తండా, సంగాయగుట్ట తండా, గంగాసాగర్, సంగెంకుర్దు, గోరేపల్లి తదితర గ్రామాల్లోని భవనాలు శిథిలావస్థలో చేరాయి. ప్రధానంగా రేళ్లగడ్డ తండాలోని పాఠశాలలో ఐదు తరగతుల్లో 67 మంది విద్యార్థులకు ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. ఇక్కడ ఓ భవనం పూర్తిగా శిథిలావస్థలోకి చేరుకోగా మరో భవనంలో ఐదు తరగతులను నిర్వహిస్తున్నారు. సంగెంకుర్దులోనూ అదే పరిస్థితి. ఓ తరగతిగది భవనం పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వర్షా కాలంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మరుగుదొడ్లు లేని సుల్తాన్‌పూర్




బంట్వారం: మరుగుదొడ్లు లేని పాఠశాల

బంట్వారం: సుల్తాన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. 35మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో విద్యార్థులు ఆరు బయటే వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని చెబుతున్నారు. స్కూల్ పక్కన వాగులో మురుగు నీరు చేరడంతో దుర్వాసన భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు ఫిర్యాదు చేస్తున్నారు.

### 120 నుంచి 12 మందికి..



బొంరాస్‌పేట: గేటులేని రామన్‌నాయక్ తండా పాఠశాల

బొంరాస్‌పేట: 120 మంది విద్యార్థులున్న మదన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం 12మందితో ఏకోపాధ్యాయ పాఠశాలగా మారింది. మరికొన్ని చోట్ల ప్రహరీ, గేట్లు లేనందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాందార్‌పూర్ పాఠశాల ఆవరణలో వాటర్‌ట్యాంకు నిరుపయోగంగా మారింది. బురాన్‌పూర్, ఎన్కేపల్లిలో అసంపూర్తిగా అదనపు భవనాలున్నాయి. టేకులగడ్డ తండా, దరికింది తండా, వడిచర్ల తదితర గ్రామాల్లో గదుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ పాఠశాలలో వంటగదులు లేనందునా ఏజెన్సీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. బస్సు సౌకర్యం లేక ఆయా తండాల విద్యార్థులు వానాకాలం, ఎండాకాలం కాలినడకనే వెళ్తున్నారు.

### విద్యార్థులు లేక..



పరిగి: గోడలు బీటలువారడంతో ప్రమాదకరంగా పాఠశాల గది

పరిగి: మండల పరిధిలోని మల్లేమోనిగూడ, బాలికల ప్రాథమిక పాఠశాల పరిగి, లక్నాపూర్ ప్రాథమిక, ఇబ్రహీంపూర్ తండా పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. మల్లేమోనిగూడ పాఠశాల తరగతి గదులు బీటలువారి కూలే స్థితిలో సిద్ధంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. మండల పరిధిలోని సొండేపూర్ ప్రాథమిక పాఠశాలలో ఆరు మంది ఉండగా ఉపాధ్యాయుడు విధులకు సక్రమంగా రావడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా చేలిమజాలతండా, జీడిగడ్డ తండాలోని పాఠశాలలు విద్యార్థులు లేక మూతబడ్డాయి.

**పెచ్చులూడి..**



దోమ: బడేంపల్లి ప్రాథమిక పాఠశాలలో పనులు పూర్తికాని గోడల మధ్య విద్యా బోధన

దోమ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు ఉదన్‌రావుపల్లి ప్రాథమిక పాఠశాల, బడేంపల్లి, రాకొండ, పెద్దతండా, ఐనాపూర్ పాఠశాలల గదులు పాతపడి శిథిలావస్థకు చేరాయి. పైకప్పుల పెచ్చులూడి ఎప్పుడు మీద పడుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు జంకుతున్నారు. దోమ, బొంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో టాయిలెట్లు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. బహిరంగా ప్రదేశాలను ఉపయోగించుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. బడేంపల్లి ప్రాథమిక పాఠశాలలో 56 మంది విద్యార్థులు ఉండగా నలుగురు ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. ఒకే తరగతి గది ఉండడంతో పాఠాలు బోధించేందుకు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు.

### ప్రహరీ లేక అవస్థలు



వికారాబాద్‌లోని చెంచు కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ప్రహరీ లేక కుక్కల ప్రవేశం

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని చెంచు కాలనీలో ప్రభుత్వ పాఠశాల 3వ తరగతి వరకు కొనసాగుతుంది. స్కూల్‌కు ప్రహరీ లేకపోవడంతో కుక్కలు, పందులు జొరబడుతున్నాయి. దీంతో చిన్నారులు ఇబ్బందుల పాలవుతున్నామని చెబుతున్నారు. ఎప్పుడు ఎవరిని కరుస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. పీలారం గ్రామంలోని పాఠశాలకు కూడా ప్రహరీ లేక అవస్థలు పడుతున్నారు.

### విద్యార్థుల సంఖ్య అంతంత మాత్రమే..



నారెగూడ ఉన్నత పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు ఉపాధ్యాయులు

నవాబుపేట: మండల పరిధిలోని నారెగూడ ఉన్నత పాఠశాలలో మొత్తం 10 మంది విద్యార్థులు ఉన్నారు. హెచ్‌ఎంతో కలిపి 7గురు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ప్రస్తుతం 6, 7తరగతుల్లో పిల్లలు ఎవరు లేరు. ఎనిమిదిలో 6మంది, తొమ్మిదిలో ఒకరు, పదిలో ముగ్గురు ఉన్నారు. అదే కాంపౌండ్‌లోని ప్రాథమిక పాఠశాలలో 18 మంది ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

### ఐదు తరగతులకు ఒక్కరే..



మోమిన్‌పేట: ఎన్కేపల్లి ప్రాథమిక పాఠశాలలో పాఠం చెబుతున్న ఉపాధ్యాయుడు

మోమిన్‌పేట: ఐదు తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు. మొత్తం విద్యార్థులు 15మందే ఉన్నారు. ఇది మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రాథమిక పాఠశాల పరిస్థితి. ఐదు తరగతులకు ఒక్కరే ఉండటంతో అందరికి ఒకే పాఠం ఎలా చెప్పాలి. తరగతికి ఇద్దరు, ముగ్గురికి పాఠాలు బోధించడం కష్టంగా ఉంది. శిథిలావస్థకు చేరిన రెండు తరగతి గదులను కూల్చేయాలని ఉపాధ్యాయుడు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చాడు.

# సరిపడా ఎరువులు ఉంచండి



మాట్లాడుతున్న రుద్రమూర్తి

## విత్తన ప్యాకెట్లకు బిల్లులు తప్పనిసరి

- ఫర్టిలైజర్ యజమానులకు ఏడీఏ రుద్రమూర్తి ఆదేశం

బషీరాబాద్: ఖరీఫ్ సాగుకు సరిపడా ఎరువులు షాపుల్లో ఉంచుకోవాలని ఫర్టిలైజర్ షాపుల యజమానులకు తాండూరు వ్యవసాయ అధికారి రుద్రమూర్తి ఆదేశించారు. సాగుకు సన్నదం కోసం మండలంలోని ఎరువుల దుకాణ యజమానులు, ఏఓ, ఏఈఓలతో శుక్రవారం బషీరాబాద్ రైతు వేదికలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే రైతులకు ఖచ్చితంగా లైసెన్స్ నంబర్‌తో కూడిన ఒరిజినల్ రశీదు ఇవ్వాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనే సమయంలో తగిన జాగ్రత్తలు సూచిస్తూ దుకాణం ముందు బ్యానర్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లను షాపు ముందు డిస్‌ప్లేబోర్డులో పెట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏఓ అనిత మాట్లాడుతూ.. అన్నదాతలు వానకాలం పంట సాగులో విత్తనాలు ఎంపిక మొదలు, ఎరువుల వాడకం వరకు వ్యవసాయ శాఖ సూచించే సూచనలు పాటించాలని అన్నారు. ప్రతీషాపు ముందు సోట్క్ బోర్డులు పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు శ్యాముల్, ప్రవీణ్, నవీన్, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పేదలను మోసం చేసింది



పరిగిలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న నాయకులు



దోమ: లబ్ధిదారుల ఇంటి స్థలాలను పరిశీలిస్తున్న విచారణ అధికారి, ఏఓ ప్రభాకర్ రావు

- డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌ల అందజేత

పరిగి: పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదని డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని 13వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను దశలవారిగా అమలు చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఇళ్లు మంజూరు కాని వారు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి చొరవతో ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలో జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు**

దోమ: గ్రామాల్లో అర్హులైన వారికే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ఇందిరమ్మ ఇళ్ల విచారణ అధికారి, ఏఓ ప్రభాకర్ రావు తెలిపారు. శుక్రవారం దోమ మండల కేంద్రంతో పాటు అనుబంధ గ్రామమైన ఉదన్‌రావుపల్లిలో అర్హులకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ల స్థలాలను స్థానిక పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలనే సంకల్పంతో ముందుకు సాగుతుందన్నారు. అర్హులైన పేదలను గుర్తించి వారికి సంబంధిత ప్రొసీడింగ్‌లను అందజేస్తున్నామన్నారు. పూర్తి స్థాయిలో లబ్ధిదారుల వివరాలనంతరం స్థల పరిశీలన చేస్తున్నామన్నారు. స్థలంలో ఇబ్బందులు లేనట్లయితే నిర్మించి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేదలు ఆందోళన చెందాల్సి అవసరం లేదన్నారు. ప్రతి పేదవారికి ఇళ్లు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.